క్లుప్తంగా

వాటర్‌ఫిల్టర్‌ల బహూకరణ



నారాయణపేట రూరల్‌: జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అవసరమైన వాటర్‌ డిస్పెన్సర్లను శనివారం ఉచితంగా బహూకరించారు. స్థానిక కోర్టులో విధులు నిర్వహిస్తున్న కరుణాకర్‌రెడ్డి తన తండ్రి దివంగత హైకోర్టు న్యాయవాది నాగార్జున్‌రెడ్డి, అదేవిధంగా రఘువీర్‌యాదవ్‌ తన తల్లి దివంగత గొల్ల యశోదమ్మ జ్ఞాపకార్థం ఇరువురు ఒక్కొక్కటి చొప్పున రెండు వాటర్‌ ఫిల్టర్‌లను అందించారు. వీటిని జడ్జి శ్రీనివాస్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయదులు, బార్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరికల్‌: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణకుమార్‌ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. గత కొన్నాళ్ల నుంచి బీడీ కార్మికుల సమస్యలపై అధికారులకు వినతి పత్రాలను ఇస్తున్న వారిగోడు ఎవరికి పట్టడం లేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వమైన అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు.

రహదారిని బాగుచేయండి



మరికల్‌: మండలంలోని తీలేర్‌ నుంచి పుసల్‌పహాడ్‌ వెళ్లే రహదారిని బాగుచేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రహదారిపై కంకర రాళ్లు తెలడంతో ద్విచక్ర వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన తమగోడు ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్పందించి తీలేర్‌, పుసల్‌పహాడ్‌ రహదారికి బీటీ రోడ్డుగా మంజూరు చేయాలని కోరుతున్నారు.

ముగిసిన వీధి నాటకం



మద్దూరు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎస్సీ కాలనీ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ' శ్రీ పోతులూరి వీరబ్రహ్మం జీవిత చరిత్ర' వీధి నాటకం శనివారం ముగిసింది. ఐదురోజులపాటు నాటోపాధ్యాయుడు జంగెటి లాలప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన వీధి నాటకం వీరబ్రహ్మం సమాధిలో ముగిసింది. కార్యక్రమంలో పాత్రదారులుగా భీములు, రాములు, నర్సప్ప, కృష్ణ, కాశప్ప, కన్యప్ప తదితరులున్నారు.

ప్రమాదకరంగా మలుపు



మాగనూర్‌: మండలంలోని అడవిసత్యారం-కొల్పూర్‌ గ్రామాల మధ్య అడవిసత్యారం గ్రామ సమీపంలో మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. గ్రామాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు బీటీరోడ్లను నిర్మిస్తుంది. కానీ రోడ్లపై మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల రోడ్డు మలుపు వద్ద ఇసుక ఉండటంతో వాహనం అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ స్వర్ణకారుల సంఘం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు.

రిటైర్మెంట్‌ @65

- అంగన్‌వాడీల వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్‌ సిబ్బంది
- ఆయాల వయస్సు నిర్ధారణలో జాప్యం
- వచ్చే నెల చివరిలోగా తేలనున్న లెక్క
- ఉద్యోగ విరమణతో పెరగనున్న ఖాళీల సంఖ్య

మద్దూరు: ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌ వయస్సును 65 ఏళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల్లో ఏప్రిల్‌ 30వరకు 65ఏళ్లు పైబడిన వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత నెలలోనే వీరు ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్‌ ఉండడంతో పొడిగించారు. వచ్చేనెల చివరిలోగా అర్హులైన వారు ఉద్యోగ విరమణ చేసే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో వయస్సు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు విధుల్లో కొనసాగారు. కొంతమంది వివిధ కారణాలతో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఇప్పటికే ఉన్న ఖాళీలతో పాటు మరిన్ని ఖాళీలు పెరిగే అవకాశం ఉంది.

వివరాల సేకరణలో అధికారులు..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల్లో ఏప్రిల్‌ 30లోగా 64ఏళ్లు పైబడిన వారిని ఐసీడీఎస్‌ అధికారి గుర్తించే పనిలో పడ్డారు. రిటైర్మెంట్‌ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ. 50వేలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో అంగన్‌వాడీ టీచర్లకు రూ. 60వేలు, ఆయాలకు రూ.30వేలు ఇస్తామని చెప్పడంతో వీరు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించేందుకు కసరత్తు చేస్తోంది.

గందరగోళం..

ఐసీడీఎస్‌ అధికారుల వద్ద ఎంప్లాయి మేనేజ్‌మెంట్‌ సిస్టం (ఈఎంఎస్‌)లో ఉన్న వివరాలను ఆయాల వద్ద ఉన్న వివరాలకు పొంతన లేకుండా పోయింది. అంగన్‌వాడీ టీచర్లకు పదోతరగతి సర్టిఫికెట్లు ఉండగా ఆయాలు చదువు కోకపోవడంతో వారి వయస్సు నిర్ధారణకోసం అధికారులు అధార్‌ కార్డులు సేకరిస్తున్నారు. అందులో కూడా చాలా మంది వయస్సు హెచ్చుతగ్గులు ఉండడంతో ప్రభుత్వాస్పత్రుల సివిల్‌ సర్జన్‌ వద్ద నుంచి వయస్సు నిర్ధారణ పత్రాలు తేవాలని చెబుతున్నారు.



మద్దూరు ఐసీడీఎస్‌ ప్రాజెక్టు కార్యాలయం

భారీగా ఖాళీలు..

ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్‌ చేసింది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో ఆయాలు ఉండేవారు కాదు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న టీచర్లే ఆయా పనులు చేసుకునే వారు మినీ కేంద్రాలు అంగన్‌వాడీ కేంద్రాలుగా మారడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరితోపాటు టీచర్‌ పోస్టులు.. వీటికి అదనంగా ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసే సంఖ్య ఉండనుంది.

మద్దూరు ప్రాజెక్ట్‌ పరిధిలో..

మండలంలోని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలో కోస్గి, మద్దూరు, దారమగిద్ద మండలాలకు కలిపి 239అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 65ఏళ్ల పైబడిన అంగన్‌వాడీ టీచర్లు 7గురు గుర్తించారు. ఆయాలను గుర్తించే పనిలో ఉన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు పరిధిలో 218అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 21ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలను నియామించాల్సి ఉంది.

వివరాలు సేకరిస్తున్నాం..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 65ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్‌, ఆయాలను గుర్తిస్తున్నాం. టీచర్లు వారు చదివిని సర్టిఫికెట్లను పరిశీలించి వయస్సును నిర్ధారిస్తున్నాం. ఆయాలను గుర్తించడంతో కొంత జాప్యం కొనసాగుతుంది. వారికి అర్హులైన ప్రభుత్వ వైద్యుడి చేత వయస్సు నిర్ధారణ పత్రం తేవాలని కోరాం. త్వరలోనే అర్హున వారి జాబితా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- గిరిజా, ఇన్‌చార్జి సీడీపీఓ, మద్దూరు ప్రాజెక్ట్‌

కంట్రోలర్‌ ఇష్టారాజ్యం

- ప్రయాణికులకు సమాచారం తెలిసేదెలా..?

నారాయణపేట రూరల్‌ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌ పాయింట్‌ నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రయాణికులకు బస్సులు సమయసారిణి తెలియడంలో ఇబ్బందులు తప్పడంలేదు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఉదయం షిఫ్టులో ఒకరు, మధ్యాహ్నం షిఫ్టులో మరొకరితోపాటు జనరల్‌ షిఫ్టుకు ఒక మహిళ అధికారిణిని ఏర్పాటు చేశారు. అయితే ఉదయం 4గంటల నుంచి రాత్రి 9:15గంటల వరకు కంట్రోలర్‌ పాయింట్‌ తెరిచి ఉంచి ముగ్గురు వారికి కేటాయించిన సమయానికి విధులు నిర్వహించాల్సి ఉంది. వారిలో ఒకరు ఇటీవల బదిలీపై వెళ్లగా తాత్కాలికంగా కోస్గి డిపోకు చెందిన డీఎస్‌లో ఉన్న డ్రైవర్‌ను వాడుకుంటున్నారు. అయితే తెల్లవారుజామున, రాత్రి వేళలో డ్యూటీలో ఉన్న కంట్రోలర్‌ సమయపాలన పాటించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. 4గంటలకు తెరవాల్సిన కాంట్రోలర్‌ గది 5.30గంటలకు గాని తెరుచుకోవడంలేదని, రాత్రి 8:45లోపే మూసేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా సమయాల్లో ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు ఎవరు అందుబాటులో లేకపోవడంతో డిపో వెద్దకు వెళ్లి సెక్యూరిటీ సిబ్బందిని అడుగుతున్నారు. దీంతో డిపో ఆదాయానికి గండి పడుతుందని డ్రైవర్‌, కండక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి డీఎం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమయసారిణి ఫ్లెక్సీలో సైతం సరియైన విధంగా బస్సు సమయాలు లేవని వాపోతున్నారు.



మూసేసినకంట్రోలర్‌ పాయింట్‌

డీఎం వివరణ..

ఈ విషయంపై డీఎం లక్ష్మిసుధను వివరణ కోరగా.. తప్పకుండా సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో కంట్రోలర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై విచారణ చేస్తామన్నారు. కంట్రోలర్లు ప్రయాణికులకు బస్సు సమయాలను తెలియజేయాలన్నారు. కంట్రోలర్‌ పాయింట్‌కు ఫోన్‌ 7382826293కి చేసి అడగవచ్చన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ నర్సింహులు

దామరగిద్ద: వేసవి క్రీడా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి డీవైఎస్‌ఓ నర్సింహులు, వేసవి శిక్షణ శిబిరాల ఇన్‌చార్జి సాయినాథ్‌ అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడా శాఖ సౌజన్యంతో పీఈటీ వెంకటప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి క్రీడా శిబిరాన్ని సందర్శించారు. ఈ మేరకు.. క్రీడాకారులతో మాట్లాడుతూ.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ క్రీడల్లో సాధన చేసి నైపుణ్యాన్ని సాధించాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీ ప్రభాకర్‌, రత్నయ్య, పీఈటీ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు

ఊట్కూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి వాగులో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల సాయంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న మైనింగ్‌ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. నాగిరెడ్డిపల్లి వాగులో ఏడాది కాలంగా పాలమూరు ఇసుక పేరుతో ఆన్‌లైన్‌ ద్వారా ఇండ్లు కట్టుకోవడానికి ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌ పేరుతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు పరిసర ప్రాంతాలలో రైతులు చేతి బోర్లువేసుకొని గత రెండుమూడు దశాబ్దాలను వరిపంటను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌ ద్వారా ఇసుక ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వడంతో నారాయణపేట, ఊట్కూరు, మక్తల్‌ మండలాలోని గ్రామాలకు నిత్యం సుమారు 50 ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యంత్రాలను తొలగించి కూలీల ద్వారా ఇసుకను తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ మమతను వివరణ కోరగా యంత్రాల సాయంతో ఇసుకను నింపుతున్న విషయం తనకు తెలియదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



యంత్రాల సాయంతో తరలిస్తున్న ఇసుక

నేటినుంచి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

మాగనూర్‌: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర) శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న నర్సింహస్వామి జయంతి సందర్భంగా ఉదయం 11గంటలకు అర్చకుల ఇంటినుంచి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకొస్తారు. అనంతరం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. 23న ఉదయం ప్రభోత్సవం, 9:25 నిమిషాలకు కల్యాణోత్సవం, 24న ఉదయం రథోత్సవం, సాయంత్రం పాలఉట్లు, 25న ఉదయం గరుడ సేవ, సాయంత్రం హనుమవాహన సేవ ఉంటుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జాతరకు మహారాష్ట్ర, కర్ణాటక, హైదారబాద్‌ నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.



స్వామివారి మూలవిరాట్‌

నీటి సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్‌..

కోస్గి: పట్టణంలోని 9వ వార్డులు నెలకొన్న నీటి సమస్యతోపాటు దాతల సహకారంతో ఉచితంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సంబంధించిశనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కాలనీవాసులకు స్వచ్ఛందంగా నీటిసరఫరా' కథనానికి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కోడిగంటి అన్నపూర్ణ స్పందించారు. శనివారం పట్టణ శివారులోని సయ్యద్‌ పహాడ్‌ దర్గా సమీపంలో ఉన్న బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆదేశాల మేరకు పుర సిబ్బంది బోరుమోటార్‌ను మరమ్మతుచేసి కాలనీవాసులకు నీరు అందించారు.



స్ఫూర్తి ప్రదాత సంత్‌ సూరదాస్‌

దామరగిద్ద: కంటి చూపు లేకపోయిన శ్రీ కృష్ణుడిపై భక్తితో ఎన్నో సంకీర్తనలు రచించి తన గానంతో భగవంతుడిని దర్శించిన మహానుబావుడు సంత్‌ సూరదాస్‌ వ్యక్తిత్వం మనందరికి స్ఫూర్తిదాయకమని సక్షం స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాఘవేందర్‌గౌడ్‌ అన్నారు. శనివారం మండలంలోని దివ్యాంగపునరావాస కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంపర్క్‌ ప్రముఖ్‌ సత్యనారాయణరెడ్డి, సీసీ అనంతమ్మ, సతీష్‌కాంబ్లే, రంజిత్‌గౌడ్‌, బోరు బుగ్గప్ప, మోనేష్‌, అమృత, రాజు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సక్షం ప్రతినిధులు

క్రీడాకారిణికి చేయూత

మక్తల్‌: మండలంలోని జక్లేర్‌ గ్రామానికి చెందిన శ్రీలత క్రీడాకారిణి జాతీయస్థాయి ఫుట్‌బాల్‌ పోటీలకు ఎంపికైనా సందర్భంగా శనివారం బీకేఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ బాక్యప్పారెడ్డి తల్లిదండ్రులు రిటైర్డు హెచ్‌ఎం గవినోళ్ల సాయిరెడ్డికమ్మలమ్మ దంపతుల చేసుతల మీదుగా శ్రీలతకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు.. నిరుపేద విద్యార్థులకు బీకేఆర్‌ ఫౌండేషన్‌ అండగా ఉంటుందన్నారు.



బాలబాలికలకు క్రీడాపోటీలు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జగ్జీవన్‌రాంనగర్‌లో బాలకృష్ణగౌడ్‌ ట్రస్టు ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. మొత్తం పది టీంలలో 50 మంది కబడ్డీ, స్కిప్పింగ్‌, కుర్చీలాట, పరుగుపందెం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, సీనియర్‌ నాయకులు కిల్లె గోపాల్‌, కురుమూర్తి మాట్లాడుతూ బాలబాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.చంద్రకాంత్‌, పార్టీ నాయకులు భరత్‌, ఈశ్వర్‌, ప్రశాంత, నందు, సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్‌, కాంగ్రెస్‌ నాయకుడు ఆంజనేయులు, క్రీడాకారులు సంతోష్‌, ప్రభాకర్‌, అమ్ములు, మానవి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌ లీకేజీ

అమరచింత: పట్టణంలోని కొత్తబస్టాండ్‌ సమీపంలో మిషన్‌ భగీరథ పైపులైన్‌ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పారుగుతుంది. 15రోజుల నుంచి లీకేజీ ఏర్పడడంతో తాగునీటి సరఫరా సమయంలో నీరు వృథాగా పారుతూ రహదారి బురదమయంగా తయారైంది. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వాలడంతో తాగునీరు కలుషితం అవుతుంది. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వాసవీమాతకు ఘనంగా పూజలు

నారాయణపేట రూరల్‌ : పట్టణంలోని సింగార్‌బేస్‌ శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం వాసవీ మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి పారాయణం, డోలారోహణం, భక్తిగీతాల ఆలాపన కొనసాగాయి. ఉత్సవమూర్తితో పట్టణ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బస్వరాజ్‌, బాలకృష్ణ, నర్సింహ, సరిత, సుప్రజ, అరుణ పాల్గొన్నారు.

కోస్గి: వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్య వైశ్య సంఘం, వాసవీ వనిత సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జయంతిలో పలువురు మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజతో ప్రారంభమైన ఈ వేడుకల్లో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చల్లా శ్రవణ్‌, కార్యదర్శి నరేందర్‌, కో-శాధికారి వీరేశం పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. గోకుల్‌నగర్‌కు చెందిన నాగులు దంపతులు అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, తదితర పూజ కార్యక్రమాలు పూజారి మధుసూదనచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు విజయ్‌, కృష్ణయ్య, శరత్‌, రమేష్‌, రవికుమార్‌, రాజయ్య పాల్గొన్నారు.

మక్తల్‌: మండల కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. భక్తులు అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, తదితర పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం వాసవీ మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్‌, భాస్కర్‌, అనుగొండ శ్రీనివాసులు, కొత్తమీరాబాయి, పోర్ల వెంకటేష్‌, సరళ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మరికల్‌: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ మేరకు.. అమ్మవారి విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, అభరాణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పేటలో అమ్మవారి డోలారోహణం నిర్వహిస్తున్న మహిళలు



కోస్గిలో..



మద్దూరులో..



మక్తల్‌లో..

వార్డుల్లో పచ్చదనం

- ఆహ్లాదాన్ని ఇస్తున్న పట్టణ ప్రకృతి వనాలు
- మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

అమరచింత: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా పట్టణ ప్రకృతి వనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వార్డుల్లో పార్కులు ఏర్పాటు చేయడంతో పచ్చదనం పరుచుకుని ప్రజలకు ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయి. ఆట వస్తువులు, వాకింగ్‌ ట్రాకర్‌లు నిర్మించడంతో చిన్నారులతో పాటు నడివయస్సులో ఉన్న వారు వీటిలో సేదతీరుతున్నారు. మున్సిపల్‌ అధికారులు నిరంతరం వీటిలోని మొక్కలకు నీటిని అందిచడమే కాకుండా గడ్డివిత్తనాలను చల్లి పచ్చని గడ్డి పరుచుకునేలా చేస్తున్నారు. పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటు ప్రారంభంలో ఒక్కోదానికి రూ.5నుంచి రూ.6లక్షలు మంజూరు చేసి, ఎకరం స్థలంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు అనుకున్న విధంగా లేకపోవడంతో ఉన్న స్థలంలోనే వీటిని ఏర్పాటు చేయండని కలెక్టర్‌ ఆదేశించడంతో ఒక్కో దానికి సుమారు రూ.లక్షకు పైగా వెచ్చించి లక్ష్యాన్ని పూర్తి చేశారు.

మున్సిపాలిటీల వారిగా ఇలా..

వనపర్తి మున్సిపాలిటీలో 33 వార్డులకు సుమారు రూ.కోటి వెచ్చించి పట్టణప్రకృతి వనాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్‌ అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల కాంపౌండ్‌ వాల్‌తో నిర్మించగా మరికొన్ని చోట్ల తీగలతో చుట్టూ ప్రహరి వేయించారు.

కొత్తకోట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను ఇప్పటి వరకు 12 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మిగిలిన 3 వార్డుల్లో స్థలాన్ని పరిశీస్తున్నారు. వీటికోసం మున్సిపాలిటీ ద్వారా రూ. 23 లక్షలు ఖర్చు చేయనున్నారు.



అమరచింతలోని 1వ వార్డులో పట్టణ ప్రకృతి వనం

పెబ్బేరు మున్సిపాలిటీలో 13 వార్డులకు గాను అన్ని వార్డుల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటన్నింటికి మున్సిపల్‌ నిధుల నుంచి ఇప్పటి వరకు రూ.26 లక్షలు వినియోగించారు.

ఆత్మకూర్‌ మున్సిపాలిటీలో పది వార్డులకు గాను రెండేళ్ల కిందట మూడు పట్టణ ప్రకృతివనాలను నిర్మించారు. వాటి కోసం అప్పట్లో రూ.8లక్షలు వినియోగించారు. ప్రస్తుతం ప్రభుత్వ స్థలాలు ఉండడంతో మరో పది ప్రాంతాల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటికోసం మరో రూ.10లక్షల ఖర్చు చేశామని మున్సిపల్‌ అధికారులు వెల్లడించారు.

అమరచింత మున్సిపాలిటీలో పది వార్డులకు గాను మూడేళ్ల కిందట ఒకటవ వార్డులో రూ.5లక్షలతో పార్కులను ఏర్పాటు చేశారు. రెండవ, నాల్గవ, ఐదవ వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటికోసం సుమారు రూ.8 లక్షలు వెచ్చించారు. మిగిలిన వార్డులలో ప్రభుత్వ స్థలాలు గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

పచ్చదనం బాగుంది..



ఆత్మకూరు మున్సిపాలిటీలలో వార్డుల్లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీ ప్రజలు ,చిన్నారులు వాటిలో చేరి సరదాగా గడుపుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా వుంది.

- జగదీశ్వర్‌ గౌడ్‌, ఆత్మకూర్‌

అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో కనిపించే పార్కులుగా వీటిని తీర్చిదిద్దాలి. కేవలం మొక్కలు నాటి వదిలి పెట్టడం కాకుండా చిన్నారులు, పెద్దల కోసం అవసరమయ్యే విధంగా తీర్చిదిద్దాలి.

- వెంకటేష్‌, అమరచింత